

బిచ్కుందలో లీకేజీ పైపులతో మురికి నీటి సరఫరా

బిచ్కుంద, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద దాదాపు రెండు నెలలుగా మిషన్ భగీరథపైపు లీకేజీ కావడంతో వృధాగా నీరు పోతోంది. రోడ్లపై నీరు ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. పట్టణంలో సరఫరా అయ్యే నీరు లీకేజీ అయిన నీరు పైపుల ద్వారా కలిసి సరఫరా కావడంతో తాగడానికి వీలు లేకుండా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లపై ప్రవహించే నీటిని దాటేందుకు దత్తానగర్ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు లీకేజీని మిషన్ భగీరథ పైపుల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఊపందుకున్న.. వరి నాట్లు!



వరి నాట్లు వేస్తున్న కూలీలు



- జిల్లా వ్యాప్తంగా 80 వేల ఎకరాలకు పైగా వరినాట్లు
- ఈనెల చివరికల్లా మరింత సాగయ్యే అవకాశం
- కూలీల కొరత.. పక్క రాష్ట్రాల నుంచి కూలీలను రప్పిస్తున్న రైతులు
- వరితో పాటు మొక్కజొన్న, శనగ, జొన్న వైపే రైతుల మొగ్గు
- ఈ యాసంగిలో 3.90 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం
- ఇందులో ఇప్పటి వరకు 2లక్షల ఎకరాల్లో సాగైన పంటలు

కామారెడ్డి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా యాసంగి సాగు జోరుగా సాగుతోంది. పెద్ద ఎత్తున పంటలను రైతులు సాగు చేస్తున్నారు. యాసంగిలో ప్రధానంగా నీటి వనరులకు అవకాశం ఉన్న భూముల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా వరి, మొక్కజొన్న, శనగ, జొన్న, పొద్దు తిరుగుడు లాంటి పంటల సాగు వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. వరి నాట్లు సైతం ఊపందుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 80వేల ఎకరాలకు పైగానే వరినాట్లు పడ్డాయి. ఈ నెల చివరకల్లా మరింత వరి సాగయ్యే అవకాశం ఉంది. కూలీల కొరత ఏర్పడుతున్నప్పటికీ రైతులు పక్క రాష్ట్రాల కూలీలను రప్పిస్తూ నాట్లు వేస్తున్నారు. వరితో పాటు ఈ యాసంగిలో శనగ, మొక్కజొన్న, జొన్న పంటలను రైతులు ఎక్కువగానే సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2లక్షల ఎకరాలకు పైగా వివిధ పంటలు సాగైనట్లు వ్యవసాయాశాఖాధికారులు చెబుతున్నారు.

జిల్లాలో పంటల సాగు ఇలా..

జిల్లాలో యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు రైతులు సుమారు 2లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. జిల్లా సాధారణ సాగు 4.21 లక్షల ఎకరాలు కాగా 3.90 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో ప్రధానంగా వరి, మొక్కజొన్న, శనగ, జొన్న, పొద్దుతిరుగుడు పప్పు దినుసు పంటలను రైతులు సాగు చేయనున్నారు. జిల్లాలో ఈ యాసంగిలో అత్యధికంగా వరి పంట సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో 2.36 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 80వేల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. ఈ నెల చివరికల్లా మరిన్ని వరినాట్లు పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మొక్కజొన్న 26,313 ఎకరాల్లో సాగయింది. శనగ 55,631 ఎకరాలు, జొన్న 19,353, గోధుమ 1,054, పొద్దుతిరుగుడు 5202, కందులు 2000, చెరుకు 1015, సోయాబీన్ 546 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.

వలసకూలీలతో నాట్లు

గత రెండు సంవత్సరాలుగా వానాకాలం, యాసంగి సీజన్‌లలో జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి వెతుక్కుంటూ వరి నాట్లకు కూలీలు వలస వస్తున్నారు. జిల్లాలోని బాన్సువాడ, నస్రూల్లాబాద్, బీర్కూర్, బిచ్కుంద, ఎల్లారెడ్డి, లింగంపేట, నిజాంసాగర్, పిట్లం, కామారెడ్డి, మాచారెడ్డి, భిక్కనూర్ ప్రాంతాల్లో వలసకూలీలు వరినాట్లు వేస్తున్నారు. ఇక్కడి మధ్యవర్తులు కొందరు బీహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకువస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలకు ఎకరాన రూ.5500ల నుంచి రూ.6500ల వరకు వలస కూలీలకు చెల్లిస్తు న్నారు. స్థానికంగా ఉండే కూలీలకు కూడా డిమాండ్ పెరిగింది. గతంలో రూ. 300ల నుంచి రూ.400ల వరకు ఉండే కూలీ ప్రస్తుతం రూ.500ల నుంచి రూ.600ల వరకు చెల్లిస్తున్నారు. మగ కూలీ లకు రూ.700ల నుంచి రూ.800ల వరకు ఇస్తున్నారు. దీంతో పాటు జిల్లాకు సరిహద్దులో ఉన్న సిద్దిపేట, సిరిసిల్ల, మెదక్, నిజామాబాద్ జిల్లాల నుంచి పొరుగు గ్రామాలకు వరినాట్లు వచ్చి కూలీలకు రవాణా చార్జీలు అదనంగా చెల్లి స్తున్నారు. రైతులు మాత్రం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలతో నాట్లలో వేగం పెరిగిం దని చెబుతున్నారు.

యూరియాకు డిమాండ్

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది యాసంగి సీజన్‌లో రైతులు వరి పంట సాగుకు మొగ్గు చూపుతుండడంతో యూరియాకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీంతో రైతులు యూరియాను తీసుకెళ్లడానికి ఆయా ప్రాంతాల్లో ప్రాథమిక సహకార కేంద్రాలు, డీసీఎంఎస్‌లు, ప్రైవేట్ డీలర్ల వద్దకు వస్తున్నారు. డిమాండ్‌కు తగ్గట్టుగానే అధికారులు యూరియాను అందుబాటులో ఉంచి రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడ డిమాండ్ ఉందో గమనిస్తు యూరియాను సరఫరా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అదనంగా యూరియాను అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయాధికారులు చర్యలు చేపడుతున్నారు.

కాలువలు, చెరువులు, బోర్లపైనే..

జిల్లాలో ప్రధానంగా రైతులు సాగునీటి కాలువలు, చెరువులు, కుంటలు, బోర్లపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలా ప్రాజెక్ట్‌ల్లో నీరు ఉండడంతో వీటి కింద సుమారు లక్షల ఎకరాల్లోనే వరినాట్లు వేస్తున్నారు. దీనికి తోడు చెరువులు, బోరుమోటార్ల కింద రైతులు సాగునీరు వినియోగించుకుంటున్నారు. పలు ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, ఇతర చిన్న నీటి వనరుల్లో సైతం ఆశించిన స్థాయిలో నీరు నిల్వ ఉంది. దీంతో భూగర్భజలాలు సైతం అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేస్తుండడంతో రైతులు బోర్ మోటార్లు వినియోగించుకుంటున్నారు. పలుచోట్ల కాలువల చివరి ఆయకట్టు ప్రాంతాలకు నీరు అంతంత మాత్రంగానే అందుతోంది.

పంట సాగు వివరాల నమోదు

జిల్లాలో కొన్ని రోజులుగా వ్యవసాయాధికారులు రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేస్తున్నారు. జిల్లాలో క్లస్టర్ల వారీగా ఏఈవోలు ఈ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రైతులు వేసిన పంటల విస్తీర్ణం బట్టి వ్యవసాయ ఉత్పత్తులు ఎంతమేర వస్తాయో అంచనా వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ వివరాల ఆధారంగానే కొనుగోలు చేసే అవకాశం ఉండడంతో ముందస్తుగా పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. భవిష్యత్తులో పంటల కొనుగోళ్లతో పాటు వ్యాపారులతో మాట్లాడేందుకు ఈ లెక్కలు ఉపయోగపడుతాయని అధికారులు చెబుతున్నారు.

వ్యాపారులు ఎగుమతులపై అవగాహన పెంచుకోవాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు ఎగుమతులపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఒకరోజు ఎగుమతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎగుమతులు చేసే వాటిపై అనుమానాలు, సలహాలు, సూచనలు అందించడానికి వివిధ విభాగాల వాటాదారులతో ఈ అవగాహన కార్యక్రమంలో చర్చించారని, సమస్యలను దశల వారీగా నివృత్తి చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని వ్యాపారవేత్తలకు ఉపయోగకరంగా ఉంటుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో అత్యధికంగా సాగవుతున్న వరి ధాన్యం నాణ్యత ప్రమాణాలు కలిగి ఉన్న వాటిని ఎగుమతులు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా నుంచి ఎగుమతులను చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో ఏంఎస్ఎంఈ, బీఐఎస్, అపెడ, టీఎస్ఐఐసీ, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొ న్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ఈవీఎం గోడౌన్ సందర్శన

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద గల ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి, సీసీటీవీలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి.విక్టర్, ఆర్‌డీవో రంగనాథ్ రావు, కామారెడ్డి తహసీల్దార్ జనార్ధన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు సరళ, డిప్యూటీ తహసీల్దార్లు అనిల్, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

రోగాలు తగ్గిస్తామని తప్పుడు ప్రకటనలు ఇస్తే చర్యలు తీసుకుంటాం

- రాజారెడ్డి, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్



ప్రశ్న: జిల్లాలో ఎన్ని మెడికల్ దుకాణాలు, ఏజెన్సీలు ఉన్నాయి?

జవాబు: జిల్లాలో మొత్తం 600ల మెడికల్ దుకాణాలు, 150 వరకు మెడికల్ ఏజెన్సీలు ఉన్నాయి. ప్రతీ దుకాణాన్ని నిబంధనలకు అనుగుణంగా కొనసాగించాలని సూచిస్తున్నాం. నెలనెలా ఆయా దుకాణాల్లో తనిఖీలు సైతం చేపడుతున్నాం.

ప్రశ్న: ఇష్టారీతిన వ్యవహరిస్తు నిబంధనలు పాటించని వాటిపై ఏమైన కేసులు నమోదు చేశారా?

జవాబు: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వాటిపై 12 కేసులు నమోదు చేశామని అందులో వివిధ విభాగాలకు చెందిన అంశాలు ఉన్నాయి. ప్రస్తుతం అవి కోర్టులో ట్రయల్ నడుస్తున్నాయి.

ప్రశ్న: తప్పుడు ప్రకటనలు ఇస్తు ప్రజలను మభ్యపెట్టే వారిపై ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఈ మందులు వేసుకుంటే ఈ రోగం పూర్తిగా తగ్గేలా చేస్తామంటూ తప్పుడు ప్రకటనలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైన ఆ విధంగా ప్రచారం చేస్తే ప్రజలు నమ్మవద్దు. నిపుణులైన వైద్యుల వద్ద చికిత్స తీసుకున్న తర్వాత వారు రాసిచ్చే మందులను మాత్రమే వాడాలి.

ప్రశ్న: మత్తు, గర్భ నియంత్రణ మాత్రల అమ్మకాలపై నిఘా ఉంచారా?

జవాబు: జిల్లాలో ఏ మందుల దుకాణంలో నిద్ర మాత్రలు, గర్భ నియంత్రణకు సంబంధించిన కిట్లు అమ్మవద్దని హెచ్చరికలు జారీ చేశాం. దాదాపు అన్ని దుకాణాలు ఈ నిబంధనలు పాటిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా తాము ఆయా దుకాణాలను తనిఖీ చేసిన సమయంలో పరిశీలిస్తున్నాం. ఇంకా ఎవరైన ఇష్టారీతిన అమ్మకాలు చేసినట్లు మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి పలు సందర్భాల్లో తాళం వేసి ఉంటుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి మీ సమాధానం?

జవాబు: కోర్టు కేసులు ఉన్న సమయంలో ఆయా కేసులకు సంబంధించి కోర్టుకు వెళ్లిన సమయంలోనే తాళం వేసి వెళ్తున్నాం. ఆ తర్వాత ఎల్లప్పుడు కార్యాలయం తెరిచే ఉంటుంది.

ప్రశ్న: కార్యాలయంలో సిబ్బంది లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని సమాచారం. ఇబ్బందులను ఏ విధంగా అధిగమిస్తున్నారు?

జవాబు: కార్యాలయంలో సిబ్బంది లేక కొద్దిమేర ఇబ్బందులు తలెత్తుతున్నాయనేది నిజమే. సిబ్బంది ఉంటే ఆయా కోర్టు కేసులకు సంబంధించి నేను బయటకు వెళ్లిన సమయంలో ప్రజలకు ఏదైన అవసరాలు ఉంటే సిబ్బంది వినతులను తీసుకునే వీలుంటుంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం. త్వరలోనే ఇబ్బందులను తొలగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

(ఆంధ్రజ్యోతి, కామారెడ్డి టౌన్)

ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పెరిగేలా కృషి చేయాలి

ఇంటర్మీడియట్ ప్రత్యేకాధికారి ఒడ్డెన్న

సదాశివనగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు ప్రతీ అధ్యాపకుడు కృషి చేయాలని ఇందుకోసం విద్యార్థులకు ప్రత్యేక సూచనలు చేయాలని ఇంటర్మీడియట్ ప్రత్యేకాధికారి దాసరి ఒడ్డెన్న తెలిపారు. బుధవారం సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. కళాశాలలో ప్రార్థన సమయంలో పాల్గొని విద్యార్థులకు పరీక్షలలో పాస్ అయ్యే విధంగా తగు సూచనలు చేస్తు ఇప్పటి వరకు రాని వారు కళాశాలకు వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. గత సంవత్సరం ఫలితాలను, ఇటీవల జరిగిన పరీక్షల్లో ఎంతమంది పాస్ అయ్యారనే దానిపై వివరాలు తెలుసుకున్నారు. ఫలితాలను మరింత పెంచే విధంగా ప్రణాళికలను సిద్ధం చేసి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం, ప్రిన్సిపాల్ నారాయణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



అధ్యాపకులతో మాట్లాడుతున్న ఒడ్డెన్న



విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందేనా?

- విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందని సాంకేతిక పరిజ్ఞానం
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

7

నత్తనడకన నాగమడుగు ఎత్తిపోతల పథకం

- నాలుగేళ్లుగా కొనసాగుతున్న పథకం నిర్మాణ పనులు
- రూ.40 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకం
- 2021లో ప్రారంభమైన నాగమడుగు ఎత్తిపోతల పథకం
- ఈ ఎత్తిపోతల పథకం రూ.475 కోట్లు
- పనులు చేపట్టిన సంస్థ మెగా కన్‌స్ట్రక్షన్
- ఇప్పటికే పంప్‌హౌస్ ఆనకట్ట బెడ్ నిర్మాణాలకే పరిమితం



ఆనకట్ట నిర్మాణంలో భాగంగా బెడ్ పనులు చేపట్టిన దృశ్యం

నిజాంసాగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 40 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిర్మాణం చేపడుతున్న నాగమడుగు ఎత్తిపోతల పథకం నిర్మాణం పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువన మంజీరా నదిలో వడ్డేపల్లి జక్కాపూర్ గ్రామాల శివారులో రూ.475కోట్ల వ్యయంతో ప్రభుత్వం నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని నిర్మాణం చేపట్టడానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా 48 గ్రామాలకు 40వేల ఎకరాలకు నీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్ మండలాలకు సాగునీరు అందించాల్సిన 2021లో ఈ పథకం నిర్మాణం చేపట్టారు. ఈ పథకానికి ప్రభుత్వం మొదటిసారిగా 11 ఎకరాల భూసేకరణ చేసింది. భూ సేకరణలో 18 మంది రైతుల నుంచి సేకరించింది. ఒక్కో ఎకరాకు ప్రభుత్వం రూ.17లక్షల చొప్పున భూములు కోల్పోయిన రైతాంగానికి నష్ట పరిహారాన్ని చెల్లించింది. 11 ఎకరాలకు గాను తొమ్మిది ఎకరాలకు నష్ట పరిహారాన్ని చెల్లించి రెండు ఎకరాలకు నష్ట పరిహారాన్ని చెల్లించలేకపోయింది. దీంతో నాగమడుగు ఎత్తిపోతల పథకం నిర్మాణం ఆనకట్ట బెడ్ నిర్మాణంతో పాటు పంప్‌హౌస్ బెడ్ నిర్మాణం పనులకే పరిమితమైంది. నాలుగేళ్లుగా ఈ పథక నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. వర్షాకాలంలో కురిసిన వర్షాలకు మంజీరా నదిలో వరద నీరు రావడంతో వర్షాకాలంలో నిర్మాణం పనులు ముందుకు జరగలేదు. 9.5 కిలో మీటర్ల దూరం నిర్మాణం చేపట్టేందుకు 40 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించాల్సి ఉన్నప్పటికీ ఇప్పటికీ పైప్‌లైన్ల నిర్మాణానికి భూ సేకరణ సేకరించడంతో అధికార యంత్రాంగం విఫలమయ్యింది. నాలుగేళ్లుగా నిర్మాణం పనులు నత్తనడకన కొనసాగుతూ ఉండటం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. 475 కోట్ల మంజూరు చేసినప్పటికీ ఈ పథకానికి నిధులు ప్రభుత్వం సమకూర్చ లేదా అని ప్రశ్నార్థకమే. నిజాంసాగర్ మండలంలో నాక్ కమాండ్ ఏరియాతో పాటు పిట్లం మండలంలో కూడా పైప్‌ల నిర్మాణానికి భూ సేకరణ సేకరించడంలో అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నట్లు రైతులు విమర్శిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం నిజాంసాగర్, పిట్లం మండలాల్లో 40వేల ఎకరాల సాగు భూములను సస్యశ్యామలంగా చేయడంతో పాటు చిన్న లిఫ్ట్‌ల ద్వారా మరో 2,500 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అప్పట్లో ఈ పథక నిర్మాణానికి అప్పటి ఐటీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు శంకుస్థాపన చేసిన విషయం విదితమే. ఏడాది కింద అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నాగమడుగు ఎత్తిపోతల పథక నిర్మాణంపై ఎలాంటి చర్యలు చేపట్టకపోతుందని రైతులు వాపోతున్నారు. పథక నిర్మాణానికి కేవలం 11 ఎకరాల భూ సేకరణ చేసి మెగా కన్‌స్ట్రక్షన్‌కు అందించారే తప్ప పైప్‌లైన్‌లో నిర్మాణానికి భూ సేకరణ చేయలేకపోవడం విశేషం. తెలంగాణ ప్రభుత్వం, పాలకులు మారినా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నాగమడుగు ఎత్తిపోతల పథకం నత్తనడకన నడుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రాంగం స్పందించి నాగమడుగు ఎత్తిపోతల పథకం నిర్మాణం పనులు వేగవంతం చేయించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో అవకతవకలపై మంత్రి జూపల్లి సీరియస్

- అక్రమాలపై ఆధారాలతో మంత్రి దృష్టికి తీసుకెళ్లిన విద్యార్థి సంఘాల నేతలు
- 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలపై చర్చ
- పూర్తిస్థాయి విచారణ జరపాలని కలెక్టర్‌కు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కామారెడ్డి టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో నెలకొన్న అవకతవకలపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సీరియస్ అయినట్లు సమాచారం. మంగళవారం జిల్లాకు వచ్చిన మంత్రికి విద్యార్థి సంఘాల నాయకులు మెడికల్ కళాశాలలో భర్తీ చేసిన పోస్టుల విషయంలో, కళాశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఓ అధికారి ఉద్యోగాల భర్తీలో వసూళ్లపై, ఉపాధికల్పన శాఖలోని సిబ్బంది పని తీరుపై ఫిర్యాదు చేశారు. టెండర్ ప్రక్రియలో సదరు జిల్లా ఉపాధికల్పనశాఖ అధికారి పొందుపరిచిన నిబంధనలనే తుంగలో తొక్కి అర్హత లేకున్నా ఆయా ఏజెన్సీలకు కేటాయింపులు చేశారని, సిబ్బందికి చెందిన బంధువులు, సన్నిహితులకు ఉద్యోగాలు వచ్చేలా చక్రం తిప్పారని నిరుద్యోగులకు అన్యాయం జరిగే విధంగా చేశారని పలు కథనాలను 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా విద్యార్థి సంఘ నాయకులు ఉపాధికల్పన శాఖలో జరుగుతున్న నిబంధనల ఉల్లంఘనపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలను మంత్రికి అందించిన వినతి పత్రంతో పాటు అటాచ్ చేశారు. దీంతో విద్యార్థి సంఘ నాయకులు ఇచ్చిన ఫిర్యాదులపై బుధవారం పూర్తిస్థాయి విచారణ జరపాలని మంత్రి కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిసింది. అయితే ఇప్పటికే ఉన్నతాధికారులు ఆయా అంశాలపై వివరణ ఇవ్వాలని సదరు అధికారికి సైతం మెమో జారీ చేశారని సమాచారం.

రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

రాజంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలోని ఎస్‌పీఆర్‌కే పాఠశాలలో బుధవారం జిల్లా రవాణా శాఖ అధికారులు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాశాఖాధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రోడ్డు దాటే సమయంలో ఏర్పడే ప్రమాదాలు, మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలపై వివరించారు. ప్రతీ విద్యార్థి తమ కుటుంబ సభ్యులకు హెల్మెట్‌ని ధరించడం వల్ల అరికట్టకలిగే ప్రమాదాల గురించి చైతన్యపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుమలత, రవాణాశాఖధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి

ఫటా..ఫట్...

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

● బీబీపేట ఎస్సై ప్రభాకర్



బీబీపేట మండలంలోని అన్ని గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నామని, ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తే వారి పైచట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని బీబీపేట ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి: మీ పోలీసు స్టేషన్ పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి?

ఎస్సై:బీబీపేట పోలీసు స్టేషన్ పరిధిలో 11 గ్రామాలున్నాయి

ఆంధ్రజ్యోతి:మండలంలోని యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?

ఎస్సై:మండలంలోని యువతీ, యువకులకు, కస్తూర్బాగాంధీ పాఠశాలలు, ప్రభుత్వ బాలికలు, బాలుర పాఠశాలల్లో వివిధ అంశాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి:గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్నారా?

ఎస్సై: మండల పరిధిలో ఉన్న ప్రతీ గ్రామంలోని ప్రజలకు సీసీ కెమెరాల పనితీరు పట్ల అవగాహన సమావేశాలను పెట్టి తెలియజేశాం. పలువురి సహకారంతో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తాం.

ఆంధ్రజ్యోతి: డ్రంకెన్ డ్రైవ్ నివారణకు అవగాహన కల్పిస్తున్నారా?

ఎస్సై: మద్యం తాగి వాహనాలు నడపరాదని యువకులకు అవగాహన కల్పిస్తున్నాం. ఓవర్ స్పీడ్ వెళ్లరాదని సూచిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో అక్రమ ఇసుక దందా కొనసాగుతుందా?

ఎస్సై:మండలంలో ఎలాంటి అక్రమ ఇసుక దందా నడవడం లేదు. మండలం మీదుగా ఇతర గ్రామాలు, మండలాల నుంచి కుడా అక్రమంగా ఇసుక తరలించడం లేదు.

ఆంధ్రజ్యోతి:మండలంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయి?

ఎస్సై:మండలంలోని జనగామ,శేరీబీబీపేట, మాందాపూర్, రాంరెడ్డిపల్లి,యాడారం,సీతారాంపల్లి, తుజాల్‌పూర్, మాల్కాపూర్, ఇస్సానగర్, ఉప్పర్‌పల్లి,బీబీపేట గ్రామాల్లో ప్రతీగ్రామానికి పోలీసు కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయడం జరిగింది.శాంతి భద్రతలపై ప్రతీగ్రామంలో సిబ్బందితో ప్రతిరోజు ప్రత్యేక నిఘాపెడుతున్నాం.

● (ఆంధ్రజ్యోతి,బీబీపేట్)

సాగునీటి కాలువల స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

● ఇరిగేషన్ డీఈ భూమన్న



సాగునీటి కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ భూమన్న

కోటగిరి,జనవరి8(ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువల స్థలాలను అక్రమంగా కబ్జా చేస్తే చర్యలు తప్పవని ఇరిగేషన్ డీఈ భూమన్న హెచ్చరించారు. కోటగిరి మండల కేంద్రంలో నిజాంసాగర్ డీ28/1/2 కెనాల్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. పాత బస్టాండ్ సమీపంలో రఫీక్ అనే వ్యక్తి సాగునీటి కాలువ ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి షెడ్డు నిర్మించడంపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కబ్జాకు గురైన స్థలాన్ని డీఈ పరిశీలించారు. కాలువలపై అక్రమ నిర్మాణాలు తొలగించాలని సూచించారు. అక్రమ నిర్మాణాలు చేపడితే సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారం రోజుల గడువులోగా అక్రమ నిర్మాణాలు తొలగించాలన్నారు. లేనిపక్షంలో నోటీసులు జారీ చేసి అక్రమ నిర్మాణాలు తొలగిస్తామన్నారు. ఆయన వెంట కోటగిరి తహసీల్దార్ గంగాధర్, ఇరిగేషన్ ఏఈ సతీష్ తదితరులున్నారు.

కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలి

ఆర్మూర్‌రూరల్, జనవరి8(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం మెరుగుపర్చుకుంటూ అడ్మిషన్‌ల సంఖ్యను పెంచాలని ఇంటర్ అకాడమిక్ స్పెషల్ ఆఫీసర్ ఒడ్డెన్న అన్నారు. ఆర్మూర్ పట్టణంలో బుధవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 90రోజుల యాక్షన్ ప్రణాళికలో భాగంగా అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకొని ఉత్తీర్ణులు అయ్యే విధంగా కృషి చేయాలని అన్నారు. నిజామాబాద్ డీఐఈవో రవికుమార్ మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్‌ల సంఖ్య పెంచడంతో పాటు సైన్స్‌విద్యార్థులకు ప్రాక్టికల్ తరగతులను ఎక్కువగా చేయించాలని సూచించారు.ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయానంద్‌రెడ్డి,అధ్యాపకులు పాల్గొన్నారు.

నందిపేటలో పీఏసీఎస్ కార్యాలయం ఏర్పాటు చేయాలి



వినయ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నందిపేట వీడీసీసభ్యులు

నందిపేట, జనవరి8(ఆంధ్రజ్యోతి): నందిపేట మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేయాలని బుధవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పలువురు ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, గ్రామాభివృద్ధి కమిటీ సదర్‌లు ఎర్రం మురళీ, మచ్చర్ల చిన్న సాయిలు,నారాయణ, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మాక్లూర్ సంఘాన్ని నాలుగు సంఘాలుగా విభజించాలి

మాక్లూర్: మాక్లూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని నాలుగు సంఘాలుగా విభజించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పాలకవర్గం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మాక్లూర్, కల్లెడి, గొట్టుముక్కల, చిక్లి నాలుగు సంఘాలుగా విభజించాలని కోరగా దానికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఈకార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బూరోల్ల అశోక్, గుండారం శేఖర్, సంఘ డైరెక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోటగిరి,జనవరి8(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన కోటగిరి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కోటగిరి గ్రామానికి చెందిన మామిడి లక్ష్మణ్(53) అనే వ్యక్తి ఎత్తొండ రోడ్డులో తన పొలానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎత్తొండ గ్రామం నుంచి గుండ్ల లక్ష్మణ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై కోటగిరి వైపు వస్తున్నారు. ఓ పాఠశాల బస్సును తప్పించే క్రమంలో ఎదురెదురుగా వీరి వాహనాలు ప్రమాదవశాత్తు ఢీకొనడంతో కోటగిరి గ్రామానికి చెందిన లక్ష్మణ్ అక్కడిక్కడే మృతి చెందారు. మరో వ్యక్తికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు.

డిజిటల్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వేల్పూర్, జనవరి8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న డిజిటల్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేల్పూర్ ఎస్సై సంజీవ్ సూచించారు. బుధవారం వేల్పూర్ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిజిటల్ అరెస్టు అనేది సైబర్ క్రైం టెక్నిక్, ఇక్కడ మోసగాళ్లు ఎస్ఎంఎస్ పంపడం, వ్యక్తులకు వీడియో కాల్ చేయడం, ప్రభుత్వ దర్యాప్తు సంస్థల నుంచి చట్టాన్ని అమలు చేసే అధికారులుగా నటిస్తూ మిమ్మల్ని బురిడికొట్టించి మీ వద్ద నుంచి డబ్బులు దండుకుంటారని పేర్కొన్నారు. కాబట్టి డిజిటల్ అరెస్టు మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈ సైబర్ మోసాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండి తమ వ్యక్తిగత ఆధార్‌కార్డు నెంబర్, బ్యాంకు అకౌంట్ నెంబర్ మొబైల్ ఓటీపీ, తదితర వివరాలను గోప్యంగా ఉంచాలని సూచించారు. మీపేరుపై డ్రగ్స్, తప్పుడు పాస్‌పోర్టులు, మాదకద్రవ్యాలు, అక్రమ రవాణా, మనీలాండరింగ్, నిషేధిత వస్తువులు వచ్చినట్టుగా చెబుతారన్నారు. ఒక వేళ అసలు నేను ఎలాంటి ఆర్డర్ పెట్టాలని వారితో అరిచిచెప్పిన వినరు లేదు మీ పేరు మీద వచ్చిం దని కాబట్టి బాధ్యులు అవుతారని చట్టపరంగా చిక్కుల్లో పడతారని, మీకు వారు చెబుతూ నమ్మెలా చేస్తారు. కేసు డీల్ చేసి సెటిల్‌మెంట్ చేసేందుకు డబ్బులు అడుగుతారు, నమ్మితే మీడబ్బులు పోతాయి ఇదే డిజిటల్ అరెస్టు అంటారు. డిజిటల్ అరెస్టు కేసుల్లో అధికారుల రూపంలో ఆడియో, వీడియో కాల్స్ చేస్తారు వాట్సాప్ స్కైప్ వంటి ప్లాంట్ ఫాంల ద్వారా వీడియోకాల్ చేస్తారు. బాధితులకు డిజిటల్ అరెస్టు వారంటిలను జారీ చేస్తారు. ఇతరరాత్ర చట్ట ఉల్లంఘాలను వివిధ కారణాలను చూపిస్తూ బాధితులను భయపెడతా రన్నారు. కాబట్టి నిజమైన అధికారులు ఎప్పుడు చెల్లించాలని, బ్యాంకింగ్ వివరాలు కావా లని అడగరనే విషయాన్ని ప్రజలు గమనించుకోవాలని తెలిపారు. మోసానికి గురైతే వెంటనే సైబర్‌క్రైం హెల్ప్‌లైన్ నెంబర్ 1930నెంబర్‌లో సంప్రదించాలని, పోలీస్‌స్టేషన్‌లో సైబర్ క్రైంపోలీసులకు సమాచారం అందజేయాలని ఎస్సై సంజీవ్ తెలిపారు.

కమ్మర్‌పల్లి: విద్యార్థులు శ్రద్ధాసక్తులతో చదువుకుని ప్రయోజకులవ్వాలని దురాలవాట్లకు దూరంగా ఉండాలని ప్రస్తుత పరిస్థితిల్లో అధికమవుతున్న సైబర్ నేరాల పట్ల అప్రతమత్తంగా ఉండాలని కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి అన్నారు. సైబర్ సురక్షిత, జాతీయభద్రత అనే అవశాలపై కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలు, తీసుకోవాలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా



మోర్తాడ్‌లో కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

ఇటీవల కాలంలో సమాజంలో జరుగుతున్న పలు సైబర్ నేరాలగురించి విద్యార్థులకు తెలియపరుస్తూ భవిష్యత్తులో జరుగబోవు సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించారు. వాటిబారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సైతం సైబర్ నేరాల పట్లఅవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయపాల్‌రెడ్డి, హైస్కూల్ హెచ్ ఎం సాయన్న, ఉపాధ్యాయులు, స్థానిక పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశా లలో బుధవారం సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు ఎస్సై విక్రం అవగా హన కల్పించారు. విద్యార్థులతో మాట్లాడుతూ సైబర్ క్రైం గురించి యువకులు అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్ ద్వారా మోసాలు చేస్తున్నారని వివరిం చారు. అంతేగాక ఆన్‌లైన్‌గేమ్స్ ఆడకూడదని, ఈ విధంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన వివరించారు. ఆయన వెంట పోలీస్‌సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

రుద్రూర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్ర మత్తంగా ఉండా లని రుద్రూర్ ఎస్సై సాయన్న సూచించారు. బుధ వారం రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ప్రజ లకు రుద్రూర్ ఎస్సై సాయన్న సైబర్ నేరాలపై అవగాహన కల్పిం చారు. ఇతర వ్యక్తులు మీ ఖాతా నంబర్, ఓటీపీలు అడిగితే చెప్ప వద్దని, పోలీసు లకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సద స్సులో పోలీసు సిబ్బంది ఉన్నారు.

చైన్‌స్నాచర్ అరెస్టు



చైన్‌స్నాచర్ అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్

నవీపేట,జనవరి8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న మండలంలోని నందిగామలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. నవీపేట పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నందిగామకు చెందిన గంగామణి సోమవారం రాత్రి తన ఇంటి వెనుక వైపున ఫోన్‌లో మాట్లాడుతుండగా గుర్తు తెలియని వ్యక్తి మాస్క్ ధరించి బైక్‌పై వచ్చాడని అనంతరం గంగామణి మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెల తాడుతో పాటు ఆమె చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను సైతం లాక్కెళ్లాడని ఆయన పేర్కొన్నారు.ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న నవీపేట పోలీసులు, క్రైమ్ పార్టీ ఆధ్వర్యంలో నిందితుడిని బుధవారం నవీపేటలోని శివాజీచౌక్‌వద్దపట్టుకోవడం జరిగిందని సీఐ వివరించారు. నిందితుడు నిర్మల్ జిల్లా మూటపూర్‌కు చెందిన మాదరి గంగాదర్‌గా గుర్తించడం జరిగిందని ఆయన వివరించారు. నిందితుడి వద్ద నుంచి బంగారు పుస్తెల తాడుతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. గంగాధర్ 2022సంవత్సరంలో నిర్మల్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఒకహత్యాయత్నం కేసులోసైతం నిందితుడిగా ఉన్నట్లు ఆయన వివరించారు. చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడిని 24గంటల్లో పట్టుకున్న ఎస్ఐ వినయ్‌తో పాటు పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

● మామిడిపల్లి చౌరస్తాలో చైన్‌స్నాచింగ్

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద లక్కరం రుకుంబాయి అనే మహిళా మెడలో నుంచి సుమారు మూడు తులాల బంగారు చైను మంగళవారం రాత్రి గుర్తుతెలియని దొంగ దొంగిలించాడు. మహిళ నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా స్కూటీపై వచ్చిన గుర్తుతెలియని దొంగ మహిళ మెడలో నుంచి చైన్‌ను ఎత్తుకొని పారిపోయాడు. దీంతో రుకుంబాయి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి



మేడిపల్లి పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

కోటగిరి,జనవరి8(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోటగిరి తహసీల్దార్ గంగాధర్ సూచించారు. కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలను బుధవారం తహసీల్దార్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం పెట్టాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు.

రుద్రూర్: పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీఓ సురేష్ బాబు సూచించారు. బుధవారం రుద్రూర్ మండలం రాణంపల్లి గ్రామంలో గల ప్రాథమిక ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని తహసీల్దార్, ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.

మోస్రా: చందూర్ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు.ఈసందర్భంగా ఆమెమాట్లాడుతూ విద్యార్థులకు మెనూప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎంశ్రీధర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మోస్రా: చందూర్ మండలంలోని మేడిపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో బుధవారం ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వంట పాత్రలు ఎప్పుడు శుభ్రం చేసేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనం విషయంలో ఎలాంటి తప్పిదం జరిగిన సహించేదిలేదన్నారు. సెంట్రల్ గవర్నమెంట్ పెట్టిన అపార విద్యార్థుల కార్డు పనులు గడువు ఈ నెల చివరితో ముగుస్తుండగా కార్డులు ఆన్‌లైన్‌లో చేసేటప్పుడు తప్పులు లేకుండా ఉన్నవన్నీ పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా మండలంలో ప్రైవేటు పాఠశాలలో అపార కార్డు పనులను రోజువారీ పనులను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

వేల్పూర్:మండలం పచ్చలనడ్కుడ, జాన్కంపేట్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఎంపీవో సాయిలు సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో గ్రామకార్యదర్శి భరత్, స్వరూప్, కారోబార్ లింబాద్రి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, అంగన్‌వాడి టీచర్‌లు, తదితరులు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

భీమ్‌గల్, జనవరి8(ఆంధ్రజ్యోతి): వాహనాలను మద్యం తాగి నడపరాదని ఎస్సై మహేష్‌కుమార్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణ కేంద్రంలోని ఎల్‌జె.ఫంక్షన్‌హాల్‌లో ఆటోయూనియన్, డ్రైవర్స్‌కు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతీ వాహనదారుడు సరైన పత్రాలు కలిగి ఉండాలని ఎస్సై సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని తెలిపారు. అనంతరం సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్, మహిళ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బాలో నాన్ టీచింగ్ ఉద్యోగాలకు ఆహ్వానం

ముప్కాల్, జనవరి8(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని కస్తూర్బ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న నాన్‌టీచింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ వినోద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో హెడ్‌కుక్, నైట్‌వాచ్‌మెన్ కొరకు పదోతరగతి, అసిస్టెంట్ కుక్‌కు ఏడో తరగతి పూర్తి చేసిన స్థానిక మండల మహిళ అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ముప్కాల్ మండలానికి చెందిన మహిళలు ఈనెల 11తేదీలో ఆధార్‌కార్డు, ఫోటో, సర్టిఫికెలతో కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

బోధన్‌రూరల్,జనవరి8(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో అధిక మద్యం తాగి పట్టుబడ్డ వ్యక్తిని బుధవారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా కోర్టు న్యాయమూర్తి శేషతల్పసాయి పట్టుబడ్డ వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధించారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని ప్రతీరోజు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కావున ప్రజలు అత్యధిక మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు.

దొంగ తనానికి యత్నం

ఆర్మూర్‌టౌన్, జనవరి8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో లక్ష్మీ నర్సింహ వైన్‌షాప్‌లో మంగళవారం అర్ధరాత్రి ఐదుగురు దొంగలు దొంగతనానికి యత్నించినట్లు తెలిసింది. గుర్తుతెలియని దొంగలు కారులో వచ్చి వైన్స్ షెట్టర్‌ను ధ్వంసం చేసి తీస్తుండగా పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు గమనించి వెంబడించగా దొంగలు పరారయ్యారని తెలిసింది.

సేవాలాల్ జగదాంబ ఆలయంలో చోరీ

ఎడపల్లి, జనవరి8(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని వడ్డాపల్లి గ్రామంలో గల సంత్ సేవాలాల్ జగదాంబ ఆలయంలో చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 5 గంటలకు ఆలయ పూజారి శంకర్ పూజ నిమిత్తం ఆలయానికి వెళ్లగా ఆలయ గర్భగుడి తలుపులు తెరిచి ఉండడం చూసి గ్రామస్థులకు సమాచారం అందించాడు. వెంటనే గ్రామస్థులు ఆలయానికి చేరుకుని పరిశీలించగా అమ్మవారి మెడలోని 3 తులాల బంగారు గొలుసు, 15 గ్రాముల వెండి ఆభరణాలు, సంత్ సేవాలాల్ గుడిలోని తల్వార్‌లు కనిపించక పోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి ఆలయ కమిటీ సభ్యులు ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'బీజేపీ కార్యాలయంపై దాడి పిరికి పందల చర్య'



సదాశివనగర్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు బాణాల లక్ష్మారెడ్డి

సదాశివనగర్,జనవరి 8(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్రశాఖ కార్యాలయంపై కాంగ్రెస్ గుండాలు దాడిచేయడం పిరికిపందల చర్య అని బీజేపీ రాష్ట్రకార్యవర్గసభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం సదాశివనగర్‌లో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకులు,కార్యకర్తలు తెగించి ఎదురుదాడులకు దిగేలా రెచ్చగొట్టేలా మాట్లాడరాదని హెచ్చరించారు. దేశం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అహర్నిశలు కృషిచేస్తుంటే రాష్ట్రాన్ని దోచుకోవడానికి కాంగ్రెస్ నాయకులు కంకణం కట్టుకున్నారని దీన్ని ప్రజ లందరూ గమనిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, మండల అధ్యక్షుడు కుంటరామిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అమృతభూంరావు, మండల ఉపాధ్యక్షులు చక్రధర్‌గౌడ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రమేష్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు చందర్‌నాక్, కిసాన్‌మోర్చా నాయకులు సాయిలు, గ్రామఅధ్యక్షుడు ఏనుగు జైపాల్‌రెడ్డి, నల్ల సత్యం, బీజేపీ మండల నాయకులు,బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

తాడ్వాయి: బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ బుధవారం మండల పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం మండల అధ్యక్షుడు వెల్మ సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి తాటాకు చప్పుళ్లకు బీజేపీ భయపడదు. ఈ సమావేశంలో మండల బీజేపీ రాష్ట్ర నాయకులు మర్రి బాపురెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్‌రావు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దత్తాత్రేయ, బీజేపీ సీనియర్ నాయకులు రవి రమేష్‌నాయి, బూత్ అధ్యక్షుడు రాజు, నవీన్, శ్రీనివాస్ ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన కళాశాల విద్యార్థులు

లింగంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల నిర్వహించిన సీఎం కప్‌లో రాష్ట్ర స్థాయిలో రెజ్లింగ్, లాంగ్‌జంప్, అథ్లెటిక్స్ విభాగాల్లో ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచి సత్తాచాటారు. కళాశాలకు చెందిన సభావత్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న అఖిల 53కేజీల రెజ్లింగ్ విభాగంలో ద్వితీయ స్థానం లో నిలిచారు. సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న దారావత్ సాయిబాబ లాంగ్ జంప్‌లో రెండవ స్థానంలో నిలిచారు. బీపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న సభావత్ రాహుల్ అథెలెటిక్స్‌లో 100మీటర్లులో గెలుపొందా రు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో గెలుపొందారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ అభినందిం చారు.

ఎమ్మెల్యేకు కలిసిన వెల్‌నెస్ ఆసుపత్రి బృందం



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న వెల్‌నెస్ ఆసుపత్రి బృందం

బోధన్‌రూరల్,జనవరి8(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని వెల్‌నెస్ ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ బోదు అశోక్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన స్వగృహంలో కలిసి వెల్‌నెస్ ఆసుపత్రి తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలతో పాటు సంక్రాంతి శుభాకాంక్షలు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆయన వెంట ఆసుపత్రి జనరల్ మేనేజర్ ఎం.రాజేష్ ఉన్నారు. త్వరలో నిజామాబాద్‌లో వెల్‌నెస్ ఆసుపత్రి రాబోతుందని తెలిపారు.

నేడు కమ్మర్‌పల్లికి కోదండరెడ్డి, అన్వేష్‌రెడ్డిల రాక

● రైతులతో ముఖాముఖి కార్యక్రమం



కమ్మర్‌పల్లిలోని పసుపు పరిశోధన కేంద్రం

కమ్మర్‌పల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి గురువారం(ఈ నెల 9న) తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమకమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డిలు వస్తున్నట్లు కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య ఒకప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కమ్మర్‌పల్లిలోని పసుపు పరిశోధన కేంద్రంలో నిర్వహింపబడే రైతులతో ముఖాముఖి చర్చ, వ్యవసాయసమీక్షా సమావేశంలో వీరిద్దరూ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మార్కెట్ పరిధి గ్రామాల రైతుల సంఘాల నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, సహకార సంఘాల డైరెక్టర్‌లు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చే యాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



కమ్మర్‌పల్లిలో తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో

ఆర్మూర్‌రూరల్,జనవరి8(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్‌పట్టణంలోని మానవ విద్యావనరుల కేంద్రంలో బువారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈవో రాజగంగారాం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు దయాసాగర్, జిల్లా బాధ్యులు గజేందర్, ఉపాధ్యక్షుడు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో తపస్ ఆధ్వర్యంలో ప్రచురించిన 2025 ఆంగ్ల నూత సంవత్సర క్యాలెండర్‌ను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుకెంట బుచ్చన్న, మండల విద్యాధికారి ఎన్ ఆంధ్రయ్య బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, బుచ్చిమల్లయ్య, తపస్ మండల అధ్యక్షులు సల్లూరి కిషన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్, డివిజన్ కార్యదర్శి శంకర్ ఆనంద్ మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ యూపీఎస్ పాఠశాలలో బుధవారం పీఆర్‌టీయూ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శివకుమార్, రవీందర్, సుధాకర్ రెడ్డి, లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మృత్యుంజయం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాన్కంపేట్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



జాన్కంపేట్‌లో చెక్కులను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేల్పూర్, జనవరి8(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ సొడ రమేష్, మాజీఎంపీటీసీలు సొడ చందన్, గాదేపల్లి సత్యనందం, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బొమ్మకంటి శోభన్‌గౌడ్, సొసైటీ మాజీ వైస్‌చైర్మన్ కొలిప్యాక శ్రీనివాస్, డైరెక్టర్ తలారి శేఖర్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాజారాంనగర్‌లో బీజేపీ నాయకుడు పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు చెక్కుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ ఉపాధ్యక్షుడు పెద్దోళ్ల భరత్, సాంబడికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు స్నేహితుల మధ్య ఘర్షణ

● కొడవలితో ఒకరి గొంతు కోసిన యువకుడు ● పరిస్థితి విషమం



గొంతు తెగిఉన్న గంగమల్లు

నందిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు స్నేహితులే..కలిసి మందు తాగుదామని ప్రణాళిక వేసుకున్నారు.. కలిసి తాగారు..మద్యం మత్తులో మాటా, మాటా పెరిగింది..అందులో ఒకరితాగిన మైకంలో ఎదుటి వ్యక్తి గొంతును కొడవలితో కోసేశా డు. రక్తం మడుగుల్లో కొట్టుమిట్టాడాడు. చుట్టు ప్రక్కల వ్యక్తులు గమనించి అంబులెన్సుకు ఫోన్ చేశారు. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నందిపేట మండలం ఖుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన తుంగెన గణేష్, తోట గంగ మల్లు ఇద్దరు స్నేహితులు. బుధవారం ఇద్దరు కలిసి గణేష్ ఇంట్లో మద్యం సేవించారు. క్వాటర్, ఇంకో క్వాటర్ అనుకుంటా ఫుల్‌గా తాగారు. తాగిన మైకంలో ఇద్దరి మధ్య మాట, మాట పెరిగింది. దింతో గణేష్ వంట గదిలోని కొడవలి తీసుకొచ్చి ఏకంగా గంగమల్లు గొంతును కోశాడు. రక్తం మడుగుల్లో బాధితుడు కొట్టుమిట్టాడు. చుట్టు ప్రక్కల వ్యక్తులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బాధితుడు తోట గంగమల్లును హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం.ఈ విషయమై స్థానిక పోలీసులకు వివరణ అడగగా సంఘటన జరిగిన విషయం వాస్తవ మేనని, రాత పూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

ఎడపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి):ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఎడపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై ఎస్సై వంశీ కృష్ణారెడ్డి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.


మద్నూర్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

సోయా కొనుగోలు కేంద్రంలో అవకతవకలు

మద్నూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ సోయాబీన్ కొనుగోలు కేంద్రంలో అవకతవకలు జరిగాయని తహసీల్దార్ ముజీబ్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. బుధవారం పలువురు రైతులు బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మద్నూర్ మార్కెట్ యార్డులో నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రంలో సిబ్బంది అక్రమాలకు పాల్పడుతూ రైతులకు నష్టం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రైతులు తీసుకొచ్చిన పంటకు కాటా చేయడానికి లారీ లోడు చేయడానికి ప్రభుత్వం రూ.30 చెల్లిస్తుందని. అదికాకుండా రైతుల నుంచి కొనుగోళ్ల కేంద్రం సిబ్బంది రూ. 40 హమాలీ పేరిట తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా సోయాబీన్ బస్తా 51 కిలోలు కాటా చేయాల్సి ఉండగా అదనంగా మూడు కిలోలు తీసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి హమాలీ చార్జీలు సోయాబీన్ అదనంగా తీసుకోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమ వద్ద ఇప్పటివరకు తీసుకున్న హమాలీ చార్జీలను ధాన్యం డబ్బులను తిరిగి ఇప్పించాలంటూ కోరుతున్నారు.

డొంకేశ్వర్ రామాలయంలో వైభవంగా దీపోత్సవం


రామాలయంలో దీపోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

డొంకేశ్వర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాలలో డొంకేశ్వర్ మండల కేంద్రంలో రామాలయంలో వైభవంగా జరుగుతున్నాయి. డిసెంబరు 16నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాలు జనవరి 14వ తేదీ ముగుస్తాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం 24వ రోజు దీపోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. రామాలయంలో కృష్ణుడి అకారం ఏర్పాటు చేసి 54 దీపాలు వెలిగించి మహిళలు పూజలు చేశారు. ఆలయ అర్చకుడు తిరునగిరి పాండురంగ ఆచార్య ఆధ్వర్యంలో సేవాకాల, శ్రీకృష్ణ గోదా అష్టోత్తర శతనామా పూజ, పల్లకీసేవ, దీపోత్సవం అరగింపు, పాసుర వితరణ, తీర్థప్రసాద గోష్టి పూజలు నిర్వహించారు. పూజలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులను తీర్చుకున్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు

మిర్దాపల్లి విద్యార్థిని ఎంపిక


రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

ఆర్మూర్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం మిర్దాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శిరీష రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల పీడీ సుజాత తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి వరంగల్ జిల్లాలోని గీసుకొండలో జరగనున్న 57వ సీనియర్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో శిరీష పాల్గొంటుందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని ఆలూర్ మండల వీఆర్‌టీయూ అధ్యక్షుడు జి.సాయన్న, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, వీడీసీ సభ్యులు అభినందించారు.

గీత హైస్కూల్ విద్యార్థిని..


నిహారిక

నందిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నందిపేట మండల కేంద్రంలోని శ్రీ గీత కాన్వెంట్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న మందజి నిహారిక రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. వరంగల్ జిల్లాలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి 57వ సీనియర్ ఖోఖో పోటీల్లో నిహారిక పాల్గొనున్నారు. ఈ సందర్భంగా నిహారికను పాఠశాల కరస్పాండెంట్ కనూరి గంగసాగర్, డైరెక్టర్ కానూరి శోభ, పాఠశాల హెచ్‌ఎం చెలిమెల గంగాభూషణ్, వ్యాయామ ఉపాధ్యాయులు ముత్యం, పాఠశాల సిబ్బంది నిహారికను అభినందించారు. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి ఎదగాలని వారు ఆకాంక్షించారు.

వివేకానంద చూపిన మార్గంలో నడవాలి

డిచ్‌పల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద చూపిన మార్గంలో విద్యార్థులు నడవాలని ఏబీవీపీ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఇందూరు విభాగ్ ప్రముఖ్ రెంజర్ల నరేశ్ పిలుపునిచ్చారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేల్ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా 3వ రోజు వాలీబాల్ ఫైనల్ మ్యాచ్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు దేశం, కోసం, ధర్మం కోసం పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు శివా, సభ్యులు అమృత్ చారి, వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, నాయకులు నాగరాజు,సమీర్, అక్షయ్, లెనిన్, అజయ్ సతీష్ మోహన్ పాల్గొన్నారు.


క్రీడలను ప్రారంభిస్తున్న ఏబీవీపీ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నరేశ్

అటకెక్కిన పల్లె దవాఖాన

● డాక్టర్లు రారు.. మందులు ఇవ్వరు ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఇందల్వాయి మండలంలోని పలు పల్లె దవాఖానాలు

ఇందల్వాయి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఆలోచనలతో గ్రామాల్లో పల్లె దవాఖానాల నిర్మాణాలు చేపట్టింది. పల్లె దవాఖానాలో ఒక డాక్టర్, ఒక నర్సు, ఆశావర్కర్లు పనిచేస్తుంటారు. దవఖానాకు వచ్చిన రోగులకు ఉచితంగా వైద్యం అందించి మందులను అందజేయాలి. కానీ గ్రామీణ ప్రాంతాల్లో అదేమీ ఆచరణలోకి రావడం లేదు. ఎప్పుడు డాక్టర్ వస్తారో, ఎప్పుడు దవాఖానా తెరుస్తారో తెలియక గ్రామీణ ప్రజలు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

డాక్టర్లు రాక ఇబ్బందులు

మండలంలోని నల్లవెల్లి, గౌరారం, సిర్నాపల్లి, లోలం గ్రామాల్లో పల్లె దవాఖానాలు ఉన్నాయి. ప్రతీ దవాఖానాలో ఒక ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్, ఒక నర్సు, ఆశావర్కర్లు పనిచేస్తుంటారు. ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు దవాఖానాకు వచ్చే రోగులకు వైద్యం అందించి ఉచితంగా మందులను అందజేయాలి. డాక్టర్లు సరైన సమయంలో లేకపోవడంతో వివిధ కారణాలతో పల్లె దవాఖానాకు వచ్చిన రోగులు వెనుదిరుగుతున్నారు.

సమయపాలన కరువు

సోమవారం నుంచి మంగళవారం వరకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మ ఒడి నిర్వహిస్తారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు విధులు నిర్వహిస్తున్న గ్రామాల్లో టీకాలు, దవాఖానాకు వచ్చిన రోగులను చూడాలి. ప్రతీ శనివారం పల్లె దవాఖానా పరిధిలోగల గ్రామాల్లోకి వెళ్లి టీకాలు వేయాలి. కానీ ఇవేమి పట్టించుకోకుండా ఒకేఒక్క రోజు బుధవారం మాత్రమే తాము విధులు నిర్వహిస్తున్న గ్రామాల్లోకి వెళ్లి నామమాత్రంగా విధులు నిర్వహించి వెళ్లిపోతున్నారు. దవాఖానాకు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి నెలకొంది. వివిధ ఇబ్బందులతో పల్లె దవాఖానాకు వస్తున్న రోగులకు తిప్పలు తప్పడం లేదు.

సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటాం

● విశాలరాణి, పల్లె దవాఖానా జిల్లా ప్రాజెక్టు మేనేజర్

గ్రామీణ ప్రాంతాలలో డాక్టర్లు తప్పకుండా సమయపాలన పాటించాలి. సరైన సమయంలో ఆసుపత్రుల్లో లేకుంటే వారిపై చర్యలు తీసుకుంటాం. పల్లె దవాఖానాకు వచ్చే రోగులను పరీక్షించి ఉచితంగానే మందులు అందజేయాలి.

ఎప్పుడు చూసినా తాళమే..

● జంగం గంగామణి, గ్రామస్థురాలు



వివిధ కారణాలతో జ్వరం వస్తే మాత్రల కోసం దవాఖానాకు వస్తే ఎవరూ ఉండరు. ఎప్పుడు చూసినా తాళమే ఉంటుంది. మందులు లేక మెడికల్‌లో తెచ్చుకుంటున్నా. అధికారులు స్పందించి ప్రతీ రోజు డాక్టర్లు వచ్చేలా చూడాలి.

దవాఖానాలో వైద్యులు ఉండు..

● ఆసది మురళి, గ్రామస్థుడు



నల్లవెల్లిలో పల్లె దవాఖానా ఎప్పుడు చూసినా తాళం వేసి ఉంటుంది. డాక్టర్లు సరిగారారు. ఎప్పుడు వస్తారో తెలియదు. ప్రతీరోజు డాక్టర్లు వచ్చి రోగులకు వైద్యం అందించాలి. డాక్టర్లు సరిగ్గా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందేనా!?

● పట్టించుకోని విద్యాశాఖ


బాన్సువాడ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉన్న కంప్యూటర్లు

బాన్సువాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు గాను పాఠశాలల్లో డిజిటల్, ఆన్‌లైన్ క్లాసులను ప్రవేశ పెట్టింది. లక్షలాది రూపాయల నిధులు మంజూరు చేసి ఆయా పాఠశాలల్లో కొత్తగా డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంది. కానీ కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో పాఠశాలల్లో కంప్యూటర్లు బోధించేందుకు గాను కంప్యూటర్ బోధకులు ఉండేవారు. కానీ నేడు ఉపాధ్యాయులే ఆన్‌లైన్ క్లాసులు, డిజిటల్ క్లాసులు బోధించాల్సి వస్తుంది. ప్రస్తుతం పాఠశాలల్లో సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు గాను ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. కానీ అది పూర్తి స్థాయిలో విద్యార్థులకు ఉపయోగపడుతుందో లేదో చూడాల్సిందే. పోటీ ప్రపంచంలో విద్యార్థులను అన్నివిధాలా తీర్చిదిద్దాల్సిన విద్యాశాఖ అలసత్వం ప్రదర్శించడం పై మేధావులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. బాన్సువాడ మండలంలో 46 ప్రాథమిక పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు, 13 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయులే విద్యార్థులకు డిజిటల్, ఆన్‌లైన్ క్లాసులను నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ప్రతీ పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు నిష్ణాతులైన సిబ్బందిని నియమించినట్లయితే విద్యార్థులకు న్యాయం చేకూర్చినట్లవుతుందని తల్లిదండ్రులు అభిప్రాయ పడుతున్నారు.


● ఉపాధ్యాయులే డిజిటల్, ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు..

ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులే విద్యార్థులకు డిజిటల్, ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా సమయాన్ని బట్టి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. - నాగేశ్వర్‌రావు, మండల విద్యాధికారి, బాన్సువాడ

శిథిలావస్థకు చేరిన టీటీడీసీ భవనాలు

● రూ.5 కోట్లతో నూతన భవనాలు నిర్మించేందుకు సన్నాహాలు ● పరిశీలించిన డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్


22ఏళ్ల క్రితం ప్రారంభించిన టీటీడీసీ శిలాఫలకం


పనికిరాకుండా మారిన భవనాలు

డిచ్‌పల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆదేశాల మేరకు గత రెండు వారాల క్రితం డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ 22 ఏళ్ల క్రితం నిర్మించిన సాంకేతిక శిక్షణ భవనాలను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి భవనాల నాణ్యతను పరిశీలించి వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. డిసెంబరు 12, 2003 సంవత్సరంలో సాంకేతిక శిక్షణ అభివృద్ధి కేంద్రాన్ని అప్పటి మంత్రులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, మండవ వెంకటేశ్వర రావులు ప్రారంభించారు. 20 సంవత్సరాల పాటు సేవలు అందించిన భవనాలు కొంతకాలంగా ఆలన పాలన కరువై శిథిలావస్థకు చేరాయి. దీంతో శిక్షణలు, సమావేశాలు శిథిలావస్థకు చేరిన భవనాల్లో పూర్తిగా నిలిపివేశారు. గత ఏడాది వర్షకాలంలో భవనాలు పూర్తిగా లీకేజీలతో తడిసి ముద్దయ్యాయి. భవనాల్లో షార్ట్ సర్క్యూట్‌తో గత ఏడాది అగ్ని ప్రమాదాలు జరగడంతో భవనం కూల్చివేశారు. ఎట్టకేలకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రానికి 13 కిలో మీటర్‌ల దూరంలో ఉన్న డిచ్‌పల్లిలోనే 5 కోట్లతో ఆధునాతన నూతన కార్యాలయ భవనం నిర్మించేందుకు ఇంజనీరింగ్ అధికారులు నమూనాలను తయారు చేసి అధికారులకు అందజేశారు. త్వరలోనే నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన జరగనుంది.


ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న పీడీ

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్‌రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పాఠశాల ప్రాంగణంలో లయన్స్ బోధన్ సేవా ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్పోర్ట్స్ అండ్ టాలెంట్ వీక్ నిర్వహించారు. డిసెంబర్ 19వ తేది నుంచి 25వ తేదీ వరకు ఆరు ప్రభుత్వ పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు సబ్ కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థులు గీసిన చిత్రాలు ఆలోచింపదగ్గవిగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు తప్పనిసరిగా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ సేవ అధ్యక్షుడు ఎం.బాలగంగాధర్‌రావు, సెక్రెటరీ పాపారావు, ట్రెజరర్ పాండురంగారావు, లయన్స్ ప్రతినిధులు ఆది నారాయణ, రవి కిరణ్, వీ. వెంకటేశం, సత్యనారాయణ, రాజేశ్వర్‌రావు, లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ సీఈ మధుసూదన్

పచ్చలనడ్కుడ పెద్దచెరువును పరిశీలించిన ఇరిగేషన్ సీఈ, ఎస్ఈ

వేల్పూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామ పెద్ద చెరువు ఇరిగేషన్ సీఈ మధు సూదన్‌రావు, ఎస్ఈ యాశస్విలు బుధవారం పరిశీలించారు. చెరువు విస్తీర్ణం, చెరువు కట్ట అలుగులు, చెరువు పంటలకు నీరందించే కాలువలను అధికారులు పరిశీలించారు. పరిశీలనకు వచ్చిన అధికారులతో ఈ సందర్భంగా చెరువు నుంచి పంటలకు సాగునీరు అందించే ఇరిగేషన్ కాలువను మరమ్మతులు చేయించాలని నీటిని వృధా కాకుండా కాలువకు ఇరువైపులా గొడను నిర్మించాలని స్థానిక రైతులు సీఈ ని స్థానిక రైతులు కోరారు. రైతుల కోరిక మేరకు ఇరిగేషన్ కాలువను సర్వే చేసి ప్రపోజల్ పంపాలని సీఈ మధుసూదన్, డీఈ, ఏఈలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ భానుప్రకాష్, డీఈ సురేష్, ఏఈ ప్రదీప్‌రెడ్డి, ఇరిగేషన్ సిబ్బంది, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలను చెల్లించాలి


నిజాంషుగర్స్ పునరుద్ధరణ కమిటీ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బోధన్ నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను చెల్లించాలని బుధవారం హైదరాబాద్‌లో వాణిజ్య పన్నుల శాఖ మంత్రి, నిజాంషుగర్స్ పునరుద్ధరణ కమిటీ చైర్మన్‌కు బోధన్, మెదక్, మెట్‌పల్లి యూనిట్ కార్మిక సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ లేఆఫ్ నాటి నుంచి కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం నిజాంషుగర్స్ యూనిట్లను ప్రభుత్వ అధీనంలో తిరిగి పునర్ ప్రారంభించడానికి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్మికులకు, కార్మిక కుటుంబాలను ఆదుకోవాలన్నారు. లేఆఫ్ నాటి నుంచి కార్మికులకు వేతనాలు రాకపోవడంతో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి బకాయి వేతనాలు చెల్లించేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో మెదక్, మెట్‌పల్లి, బోధన్ కార్మిక సంఘాల నాయకులు తదితరులున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న

రాష్ట్రస్థాయి అధికారుల బృందం



బీర్కూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని బుధవారం రాష్ట్రస్థాయి అధికారుల బృందం దర్శించుకున్నారు. శ్రీవారికి, అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అధికారులకు శాలువాలు కప్పి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏజీ ఆడిట్ అధికారి శేఖర్, అసిస్టెంట్ ఆడిట్ అధికారి దేవేందర్, మిషన్ భగీరథ డీఈ మున్నీ, ఏఈ రాజశేఖర్ రెడ్డి, తదితరులు శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నర్స రాజు, ప్రధాన అర్చకులు నందు పంతులు, ఆలయ మేనేజర్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కలరింగ్ పోటీ


విజేతలకు బహుమతుల ప్రదానం


కలరింగ్ పోటీల్లో విజేతలతో ఉపాధ్యాయులు

మోర్తాడ్, జనవరి8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక పాఠశాలలో ముంబాయికి చెందిన రంగోత్సవ సెలబ్రేషన్ ఆధ్వర్యంలో కలరింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ పోటీ ల్లో విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ బహు మతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బాలరాజు, ఉపాధ్యాయులు రవి, సాగర్, నర్సింహ మూర్తి, రమణచారి, రాజ్‌కుమార్, మనోజ్, రాము, సీఆర్‌పీ లు సురేష్, శ్రీరాం, శిరీష, తదితరులు ఉన్నారు.

సౌత్ ఇండియా యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌కు కలిగోట పూర్వవిద్యార్థి

● తెలంగాణ జట్టు కెప్టెన్‌గా భవాని ఎంపిక


భవాని

జక్రాన్‌పల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సౌత్ ఇండియా యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌కు మండలంలోని కలిగోట గ్రామానికి చెందిన పూర్వవిద్యార్థిని భవాని ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు యాదగిరి బుధవారం తెలిపారు. చెన్నైలోని జేపీఆర్ యూనివర్సిటీలో ఈ నెల 7నుంచి 11వ తేదీ వరకు జరిగే సౌత్ ఇండియా యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ప్రస్తుత పూర్వ విద్యార్థి భవాని నిజామాబాద్‌లోని గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతుందని తెలిపారు. ఈ టోర్నమెం ట్‌కు ఎంపికైన భవానిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమాచారి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సువర్ణ, వీడీసీ సభ్యులు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తెలంగాణ గురుకుల విద్యార్థుల ఎంపిక

మద్నూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మద్నూర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గంగాకిషోర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో వరంగల్‌లోని గీసుకొండ, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ అసోషియేషన్ ఖోఖో క్రీడాపోటీలకు మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు బోయిన్వాడ్ ఋతిక్ (10వ తరగతి), చౌహాన్ కరణ్ (10వ తరగతి), గోతి జగదీష్ (9వ తరగతి)లు. ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఇటీవల జరిగిన కామారెడ్డి జిల్లా పోటీలో పాల్గొని సీఎం కప్‌ను కైవసం చేసుకున్నారని, తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ ద్వారా జరిగిన కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, ఛాంపియన్ తదితర ఆటలలో రాష్ట్ర స్థాయిలో రాణించారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన ఈ విద్యార్థులను ప్రిన్సిపాల్, సహాయ ప్రిన్సిపాల్ సుమన్, పీఈటీ (వ్యాయామ ఉపాధ్యాయుడు) జాదవ్ గణేశ్, ప్రముఖ పద్యకవి, సంస్కృతోపన్యాసకులు బి. వెంకట్, ఉపాధ్యాయులు సంతోష్, వేణుగోపాల్, రాము, నరహరి, సమీనాలు అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

ఇంటి పన్నులు 100 శాతం వసూలు చేయండి

పెద్ద కొడప్‌గల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్నులు 100 శాతం వసూలు చేయాలని జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటి పన్నులు పూర్తి చేసేలా సిబ్బంది కృషి చేయడంతో పాటు, ఆయా గ్రామాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో కలిసి రానున్న రోజులకు గాను ఉపాధి పనులు సక్రమంగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీటితో పాటుగానే ఆయా గ్రామాల్లో నర్సరీల నిర్వహణ, కంపోస్ట్ షెడ్‌ను తదితర పనులను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రాము, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



బోర్ మోటార్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

తాగు నీటి సమస్యను లేకుండా చూస్తాం

ఎల్లారెడ్డి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తాగు నీటి సమస్య లేకుండా చూస్తామని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులోని ఒడ్డెర కాలనీలో ఎమ్మెల్యే నిధులతో వేయించిన బోరు బావికి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆదేశాల మేరకు బుధవారం చైర్మన్ పద్మ శ్రీకాంత్ బోరు మోటారును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వార్డు కౌన్సిలర్ నీలకంఠం, 12వ వార్డు కౌన్సిలర్ అల్లం శ్రీను, కాంగ్రెస్ నాయకులు మంచిర్యాల విద్యాసాగర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



భిక్షకు సహకరించిన భీమ్‌రెడ్డిని సన్మానిస్తున్న స్వాములు

శబరిమలైకి తరలివెళ్లిన అయ్యప్ప స్వాములు

భిక్కనూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు బుధవారం శబరిమలైకి తరలివెళ్లారు. ఈ సందర్భంగా సన్నిధానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడితో ప్రత్యేక వాహనాల్లో శబరిమలైకి తరలివెళ్లారు. కాగా అయ్యప్ప స్వాములకు మండలంలో రోజుల పాటు భిక్షకు సహకరించిన గ్రామానికి చెందిన భీమ్‌రెడ్డిని స్వాములు సన్మానించారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కామారెడ్డి టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమర్క అన్నారు. బుధవారం స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్‌ల ఏర్పాటు ప్రగతిపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి 1000మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధనశాఖ, గ్రామీణాభివృద్ధిశాఖల ఒప్పందం కుదిరిందని తెలిపారు. కొత్త విద్యుత్ పాలసీ, ఇంధన, గ్రామీణాభివృద్ధిశాఖ మధ్య గత సంవత్సరం నవంబరు 19న కుదిరిన ఒప్పందాన్ని జిల్లా కలెక్టర్‌లు ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ క్రమంలో మహిళలకు పెద్దఎత్తున వడ్డీ లేని రుణాలు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. పెద్దమొత్తంలో డబ్బు మహిళా సంఘాల చేతులకి వస్తున్న క్రమంలో వారు వివిధ వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి వసతులు కల్పించాలని ఆదేశించారు. మహిళా సంఘాలు సోలార్‌పవర్ ప్లాంట్‌ల ఏర్పాటుకు వారికి అందుబాటులో ఉన్న భూమిని గుర్తించాలని కలెక్టర్‌లను ఆదేశించారు. మహిళా సంఘాల ప్లాంట్ల ఏర్పాటులో ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. విద్యుత్‌శాఖ రెడ్కో ద్వారా టెండర్‌లు ఆహ్వానించిందని, త్వరలో టెండర్లు ఓపెన్ చేసి వాటిని ఖరారు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో 44 ఎకరాలు రెండు ప్రాంతాల్లో భూములను గుర్తించామని, మిగిలి భూములు ఈనెల 20లోగా గుర్తిస్తామని తెలిపారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 150 ఎకరాలు మిగిలిన 22 మండలాల్లో భూములు సబ్‌స్టేషన్ దగ్గరలో గుర్తించాలని తెలిపారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, విద్యుత్‌శాఖ ఏఈలు, ఏపీఎంలు జాయింట్ ఇన్స్పెక్షన్ చేయాలని అన్నారు. అటవీ, దేవాదాయ, ఇరిగేషన్ తదితర భూములను సబ్‌స్టేషన్‌కు 5 కిలోమీటర్ల దూరంలో పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానీయి, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్, ట్రాన్స్‌కో సీఎండీ భాస్కర్, డీఎఫ్‌వో నిఖిత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్, డీఆర్‌డీఓ పీడీ సురేందర్, ఎస్‌సీ అభివృద్ధి అధికారిణి రజిత తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

తాడ్వాయి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో కర్ణాటక సీఎం సిద్ధిరామయ్య ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వానికి బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు ముదాం దత్తాత్రేయ ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం బిజెపి నాయకులు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు పరుచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కార్యక్రమంలో తాడ్వాయి మండల అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు మర్రి బాపురెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్ రావు, అంకాలపు శ్రీనివాస్, మండల బీజేపీ ఉపాధ్యక్షులు యాదగిరి, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి నర్సింలు, కిసాన్ మోర్చ అధ్యక్షులు రవీందర్, ఓబీసీ మండల ప్రధాన కార్యదర్శి అరవింద్, ఓబీసీ ఉపాధ్యక్షులు రమేష్ నాయి, రమేష్, శ్రావణ్, బూత్ అధ్యక్షులు రాజు, నవీన్, శ్రీను మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుపంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న దృశ్యం

రామారెడ్డి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం జగదాంబ తండా గ్రామానికి చెందిన ముఖ్య రాజుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద 24 వేల రూపాయల చెక్కును బుధవారం అందజేసినట్లు మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి అందజేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మద్దికుంట నర్సాగౌడ్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి నాయక్, మండల ప్రధాన కార్యదర్శి రగోతం రెడ్డి, బీసీ సెల్ బండి ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ నేతలు, నాయకులు పాల్గొన్నారు.

భిక్కనూరు ఎస్సైకి సన్మానం

బిక్కనూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి):భిక్కనూర్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అంజనేయులును బిక్కనూరు మండలం పీ.ఎం.పీ వైద్యులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మండల ప్రతినిధులు గంగాదర్, సుదర్శన్, అంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

బిక్కనూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి , బిక్కనూరు మండల నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మోజార్టీ సీట్లు సాధించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు.కార్యక్రమంలో గంగాధర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వీఆర్‌కే విద్యార్థి



జాతీయస్థాయికి ఎంపికైన పూర్వజ

కామారెడ్డి టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వీఆర్‌కే జూనియర్ కళాశాలకు చెందిన పూర్వజ రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి పొందినట్లు కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర యువజన శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన యువజన ఉత్సవాల్లో ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న పూర్వజ ఉత్తమ ప్రతిభకనబరిచి జాతీయస్థాయికి ఎంపికైందని తెలిపారు. యువజన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ స్మీత సబర్వాల్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందించారు. ఢిల్లీలో జరిగే జాతీయ యువజన ఉత్సవాల్లో పూర్వజ పాల్గొంటుందని తెలిపారు. అదే విధంగా ఫోక్ డ్యాన్స్ విభాగంలో శాలిని, రశ్మిత, గ్రూప్, పోయేట్రీలో ఆర్‌కే నుంచి హర్షిని, ఎస్‌ఆర్‌కే నుంచి డ్రాయింగ్‌లో మైత్రేయి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు.

వేసవిలో తాగునీటి సరఫరాపై యాక్షన్ ప్లాన్

బీర్కూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్యలు తలెత్తకుండా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఎంపీడీవో భాను ప్రకాష్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం బీర్కూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో చాంబర్‌లో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా రాబోయే వేసవి కాలంలో నీటి సరఫరా గురించి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని, తాగునీరు సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ , కరెంట్ బిల్లులు చెల్లింపుల గురించి ఎంపిడివో మాట్లాడారు. ఇంటి పన్నులు వందకు వందశాతం వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాభివృద్ధి పనులు

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లపల్లి లక్ష్మాగౌడ్

రామారెడ్డి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతాయని రామారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి లక్ష్మాగౌడ్ పేర్కొన్నారు. రామారెడ్డి మండలం గొల్లపల్లిలో బుధవారం ఐదు లక్షల సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు సీసీ రోడ్డు పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్ పనులను బాధ్యతగా చేపడుతూ ప్రజాదారణ పొందాలన్నారు. కార్యక్రమంలో రామా రెడ్డి కాంగ్రెస్ మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు సామల శీలా సాగర్, మండల నాయకులు ప్రవీణ్ గౌడ్, అరికెల కిషన్ యాదవ్, ఎఎంసి డైరెక్టర్, నాయకులు రంగు రవీందర్ గౌడ్, అంజల్ రెడ్డి, గణేష్, బండి ప్రవీణ్, మహేష్, మర్రి మధు, రవి, శివరాం, మహి శలు , కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

తిప్పాపూర్‌లో విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

భిక్కనూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు నీరు పారించడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై రైతు మృతిచెందిన సంఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భైని మాల్లారెడ్డి(61) ఉదయం 6 గంటలకు తన వ్యవసాయ బావి వద్ద వరి పంటకు నీరు పారించేందుకు వెళ్లి ఉదయం 8 గంటల సమయం అవుతున్నా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు బావి వద్దకు వెళ్లి చూడగా స్టార్టర్ డబ్బా వద్ద విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పెద్దమ్మ దేవాలయంలో చోరీ

రాజంపేట,జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని పెద్దమ్మ దేవాలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు తాళం పగలగొట్టి హుండీలో ఉన్న డబ్బులను దొంగిలించారని ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. బుధవారం ఉదయం స్థానికులు ఆలయకమిటీ సభ్యులకు తెలపడంతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆలయంలోని సీసీ ఫుటేజ్‌ను పరిశీలించి దొంగలను గుర్తించి పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బీర్కూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం బరంగేడ్గి మంజీరా నది నుంచి మంగళవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

పార్టీ బలోపేతం కోసం కృషి చేయండి



దీపాదాస్ మున్షీతో జుక్కల్ ఎమ్మెల్యే తోట

పెద్దకొడప్‌గల్, జనవరి 08 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపామున్షి సూచించినట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో దీపాదాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న పథకాలపై ప్రజలకు వివరించాలని దీపాదాస్ సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎస్‌ఐ

పెద్దకొడప్‌గల్, జనవరి 08 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లిలో బుధవారం కాటేపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ యువత క్రీడలతో పాటు కష్టపడి ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులతో పాటు ఊరికి మంచిపేరు తీసుకరావాలని సూచించారు. దీంతో పాటుగానే యువత తనకు అందివచ్చిన అవకాశాలనను సద్వినియోగం చేసుకుని జీవితంలో రాణించాలని కోరారు. దీంతో పాటుగానే యువత ఈ మధ్యకాలంలో మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. క్రీడలలో ఓడిన వారు బాధపడకుండ గెలుపుకోసం కృషి పాటుపడాలని పేర్కొన్నారు. క్రీడాకారులకు క్రికెట్ జెర్సీలను అందజేసిన గ్రామానికి చెందిన రామాగౌడ్‌ను ఎస్‌ఐ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రవీణ్ కుమార్, యుపిఎస్ హెచ్‌ఎం బాల్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, గ్రామ పెద్దలు మల్లప్ప పటేల్, మొగులాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ, వీఓఏ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

కామారెడ్డి టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పరిధిలోని ఐకేపీ, వీఓఏ ఉద్యోగ సంక్షేమ సంఘం క్యాలెండర్, డైరీని బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐకేపీ, వీఓఏఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకారం ఎల్లప్పుడు ఉంటుందని అన్నారు. ఉద్యోగులు మహిళా సంఘాలకు సంబంధించిన నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి, వీఓఏ ఉద్యోగుల సంక్షేమసంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పఠాన్‌గౌస్‌ఖాన్, వీవోఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మనోజ్, శివరాంనాయక్, జిల్లా,మండల కమిటీ అధ్యక్షులున్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులను నిర్వహించాలి

రాజంపేట,జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని గుడితండాలో బుధవారం గ్రామపంచాయతీ రికార్డులను డివిజనల్ అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 100 శాతం ఇంటిట్యాక్స్ వసూలు చేయాలని ప్రతిరోజు గ్రామాలలో పారిశుధ్యం నిరంతరం జరిగేలా చూడాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి : ఎస్సై

దోమకొండ, (బీబీపేట) జనవరి 8(ఆంధ్రజ్యోతి):రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని బీబీపేట ఎస్సై ప్రభాకర్ అన్నారు. బుధవారం బీబీపేట మండల కేంద్రంలో సైబర్‌నేరాలు, రోడ్డు నిబంధనలు, హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దని, ఎవరైనా కొత్త వ్యక్తులు ఫోన్ చేసి వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో సభలు

దోమకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి):మండలంలోని గొట్టిముక్కుల, లింగుపల్లి, అంబార్‌పేట గ్రామాల్లో ఉపాధి హామీ పథకము సోషల్ ఆడిట్ గ్రామ సభలను ఆయా గ్రామాల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిట్ సభ్యులు గ్రామాల్లో జరిగిన పనుల వివరాలు, ప్రజల సలహాలను సభల్లో చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సంజయ్‌రావు, నాయాబ్ తహసీల్దార్ రేఖ, ప్రత్యేక అధికారి బాలక్రిష్ణా, కార్యదర్శులు భానుశ్రీ, స్నేహ, పద్మ,టీఏ లు లింగం, రాజేశ్వర్,అంగన్‌వాడీ టీచర్ రాణి, ఫీల్డ్ అసిసెంట్‌లు కర్రోల్ల అంజాగౌడ్, బాల్‌నర్సు, శంకర్, పెద్దమడ్డల రాజు,నత్తి రాంచంద్రం, సంజీవ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు

లింగంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో ఎంపీపీ, జడ్పీ టీసీ, సర్పంచ్‌స్థానాలు పూర్తిగా కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేలా కార్యకర్తలు కష్టపడాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ అన్నారు. ఆయన బుధవారం మండలంలోని మోతెలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశాల మేరకు పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్ని గ్రామాలలోను కార్యకర్తలు కలసికట్టుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని ఆయన సూచించారు. కష్టపడి పనిచేసిన వారికే స్థానిక ఎన్నికల్లో టికెట్లు ఇస్తామని ఎమ్మెల్యే తెలియజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు రాజు, ప్రసాద్‌గౌడ్, భైరయ్య, భాస్కర్‌గౌడ్‌లతో పాటు కార్యకర్తలు ఉన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - రోటి కప్‌డా రోమాన్స్
దర్శన్ - యూఐ
ప్రియా 70 - పుష్ప-2
ప్రియా 35 - మ్యాక్స్

బాన్సువాడ

మహేశ్వరి - పుష్ప-2
వెంకటేశ్వర - మ్యాక్స్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

